కందికి కోలుకోలేని దెబ్బ

- రెండు దఫాలు రాలిన పూత, పిందె
- మూడో దఫా వచ్చినా నిరాశాజనకమే
- దారుణంగా పడిపోయిన దిగుబడి
- కోత కోయకుండా వదిలిన రైతులు



తాళ్లకాల్వ గ్రామంలో కోత కోయని కందిపంట



కంది విత్తనాలు తాలు వచ్చాయని చూపుతున్న రైతు బ్రహ్మానందరెడ్డి

గాండ్లపెంట: అతివృష్టి- అనావృష్టి రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తోంది. సంప్రదాయ పంట వేరుశనగలో తరచూ నష్టాలు వస్తున్నాయని ప్రత్యామ్నాయ పంటగా కంది సాగు చేస్తే అందులోనూ నష్టమే వెంటాడింది. ఖరీఫ్–2024లో కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా సాధారణ సాగు 4,452 హెక్టార్లకు గాను 3,757 హెక్టార్లలో కంది సాగు చేశారు. గాండ్లపెంట, తలుపుల మండలాల్లో సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా కంది సాగైంది. ఆరు నెలల వ్యవధి కలిగిన ఈ పంటను ఎన్నో ఆశలతో సాగు చేశారు. ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. గత నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన వర్షాలకు పూత, పిందె రెండు దఫాలు రాలిపోయింది. మూడవ విడతలో మళ్లీ పూత, పిందె వచ్చింది. దిగుబడి మాత్రం ఊహించనంతగా పడిపోయింది. విత్తనం తాలుగా వచ్చింది. వసాయాధికారులు పంటకోత ప్రయోగాలు చేసినప్పుడే దిగుబడి గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు. సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో మూడు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడి రావాలి. అయితే వర్షాభావం, అధిక వర్షాల కారణంగా కందికాయ తాలు రావడంతో ఎకరాకు 7 నుంచి 10 కిలోలకు దిగుబడి పడిపోయింది. కాయ నాణ్యత లేకపోవడంతో ఈసారి క్వింటాలు రూ.4వేల నుంచి రూ.5వేలకు మించలేదు. దీంతో చేసేది లేక చాలామంది రైతులు కోత కోయకుండా పంటను అలానే ఉంచేశారు.

దారుణంగా నష్టపోయాం



వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కంది పంట వేశాను. ఐదు ఎకరాల విస్తీర్ణంలో మొత్తం రూ.50వేల దాకా పెట్టుబడి పెట్టి కంది పెట్టాను. ఎకరాకు 10 కిలోలు కూడా దిగుబడి రాలేదు. పంట కోతకు చేసి మిషన్‌లో నూర్పిడి చేస్తే గింజలు తాలుగాను, పుచ్చిపోయి ఉన్నాయి. గత ఏడాది అంతర్‌పంటగా వేసినా క్వింటా రూ.6,500 నుంచి రూ.8,500 దాకా ధర ఉండేది. ఈసారి క్వింటా రూ.5వేలలోపే పలుకుతోంది. దారుణంగా పంట నష్టపోయాం.

– బ్రహ్మానందరెడ్డి, రైతు, తాళ్లకాల్వ, గాండ్లపెంట మండలం

కూలీల ఖర్చులూ రాలేదు



నేను రెండు ఎకరాల్లో కంది సాగు చేశాను. వాతావరణ ప్రభావంతో ఊహించని విధంగా దిగుబడి తగ్గిపోయింది. రెండు ఎకరాలకు గాను 30 కిలోల దిగుబడి వచ్చింది. మండీకి తీసుకెళితే రూ.1,350 ఇచ్చారు. కూలీల ఖర్చుకు కూడా రాలేదు. వ్యవసాయంపై ప్రకృతి కరుణతో పాటు పాలకుల సాయం కూడా ఉండాలి. లేకుంటే మనుగడ సాగించడం కష్టమవుతుంది.

– బి.కృష్ణానాయక్, కల్లుబావితండా

దిగుబడి తగ్గిపోయింది



ఖరీఫ్‌- 2024లో సాగు చేసిన కంది పంట వాతావరణ ప్రభావం వల్ల దిగుబడి తగ్గింది. అక్టోబరు, డిసెంబరు నెలలో కురిసిన అధిక వర్షాలకు భూమిలో అధిక తేమ వలన పూత, పిందె రాలిపోయింది. రైతులకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లింది.

– సత్యనారాయణ, ఏడీఏ, కదిరి

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



మల్లిరెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు: రీ సర్వే ద్వారా భూ సమస్యలను పరిష్కారమవుతాయని తహసీల్దార్ శోభా సువర్ణమ్మ అన్నారు. మండలంలోని మల్లిరెడ్డిపల్లిలో బుధవారం రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బాలసముద్రం, మల్లిరెడ్డిపల్లి గ్రామాలలో రెండవ విడత రీసర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రీ సర్వేలు రైతుల భూములను కొలతలు వేసి సరిహద్దులు నిర్ణయిస్తామన్నారు. అనంతరం పట్టాదారు పాసు పుస్తకాలను అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మల్లికార్జున, సర్వేయర్ నరేష్ , గ్రామస్తులు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాల, సామలగొంది గ్రామాల్లో బుధవారం రెండో విడత భూముల రీ సర్వేపై తహసీల్దార్ బాబూరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రీ సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి తమ పొలాలను సర్వే చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జిలాన్‌బాషా, ఆర్‌ఐలు జాఫర్, అశోక్, వీఆర్వోలు చంద్రశేఖరరెడ్డి, చంద్రశేఖర్, సచివాలయ సర్వేయర్‌లు జగన్నాథరెడ్డి, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

రక్తహీనత, పౌష్టికాహార లోపాలు నివారించాలి



మల్లిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయలు పంపిణీ చేసిన దృశ్యం

తనకల్లు: బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాలు నివారించాలని ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి సూచించారు. మండలంలోని గందోడివారిపల్లి సెక్టార్‌లోని సక్షం (సిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టైనబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) అమలవుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత తదితర సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం సక్షం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. అన్ని వసతులతో పాటు పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాలలోనే పండించిన కూరగాయలు, ఆకుకూరలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని, ప్రీ స్కూల్ చిన్నారులకు కేంద్రంలోనే వండి వడ్డించాలని ఆదేశించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, మహిళా కార్యదర్శి రిహానా, కార్యకర్తలు సాయిలక్ష్మీ, పద్మావతి, శోభారాణి, భాగ్యమ్మ, రెడ్డెమ్మ, ఈదిలక్ష్మీ, వెంకటరమణమ్మ, మగ్బూల్‌బీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి



ధనియానిచెరువులో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

ఎన్‌పీకుంట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం ప్రతి రైతూ తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. మండల కేంద్రం ఎన్‌పీకుంటతో పాటు ధనియానిచెరువు, వెలిచలమల, గొకనపల్లి, మరికొమ్మదిన్ని రైతు సేవ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ లబ్ధి చేకూరిన రైతులందరికీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించాలని ఆర్‌ఎస్‌కే సిబ్బందిని ఆదేశించారు. మండల వ్యాప్తంగా 6228 మంది రైతులు ఉండగా ఇప్పటికి 4977 మంది రైతులు మాత్రమే విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన 1251 మంది రైతులు తప్పనిసరిగా ఈనెల చివరినాటికి నమోదు చేసుకోవాలని తెలిపారు.

నమోదు చేసుకోండి

కదిరి అర్బన్: మండలంలో భూమి కలిగిన రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్, మొబైల్ ఫోన్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో సమీపంలోని రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించండి



కొక్కంటిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

తనకల్లు: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం సూచించారు. బుధవారం ఆమె కొక్కంటి ప్రాథమికారోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. పీహెచ్‌సీలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో ఆరా తీశారు. మందుల కొరత ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. చిన్నారుల వ్యాక్సినేషన్ వివరాలను వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజును అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిన్నారులకు టీకాలు

తాడిమర్రి: మండలంలోని తాడిమర్రి, పెద్దకోట్ల, పిన్నదరి, దాడితోట, కునుకుంట్ల, ఎం.అగ్రహారం, నార్శింపల్లి, చిల్లవారిపల్లి తదితర గ్రామాల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఐదేళ్ల వయసులోపు చిన్నారులకు ఐపీవీ, పీసీబీ, రోటా, పెంటా, ఓపీఓ, ఎమ్మార్, హెపటైటిస్ బీ తదితర వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ లక్ష్మీకాంతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నిక సజావుగా సాగేనా..?

- నేడు గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక
- బలం లేకపోయినా కుర్చీపై టీడీపీ కన్ను
- కిడ్నాప్ డ్రామాతో బయటపడ్డ కుట్రలు



గాండ్లపెంట ఎంపీడీఓ కార్యాలయం

కదిరి: గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక సజావుగా సాగేనా? అని వైఎస్సార్‌సీపీ నాయకులే కాకుండా జిల్లా వ్యాప్తంగా పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీ తాతం జగన్‌మోహన్ వ్యక్తిగత కారణాలతో గత ఏడాది జూలై 8న పదవికి రాజీనామా చేశారు. ఈయన రాజీనామాను జూలై 8న అధికారులు ఆమోదించారు. అప్పటి నుంచి వైస్ ఎంపీపీ గంగోజమ్మ ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఉన్నారు. ఇటీవల ఎంపీపీ ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా గురువారం ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారిగా సుదర్శన్‌ను నియమించారు.

ఓటు వేసేందుకు వారు అర్హులు కాదు

గాండ్లపెంట మండలంలో మొత్తం 7 ఎంపీటీసీ స్థానాలుండగా అందులో గాండ్లపెంట, కటారుపల్లి, గొడ్డువెలగల, సోమయాజులపల్లి, మలమీదపల్లి, వేపరాల ఇలా 6 ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు. టీడీపీ ఒకే ఒక్క చోట సోమయాజులపల్లి ఎంపీటీసీ స్థానంలో మాత్రమే గెలిచింది. ఇప్పుడు ఎంపీపీ స్థానం కైవసం చేసుకోవాలంటే నలుగురు ఎంపీటీసీల బలం ఉండాలి. ఆ బలం వైఎస్సార్‌సీపీకి ఉంది. ఎంపీ, ఎమ్మెల్యే, ఎంఎల్‌సీ, కోఆప్షన్ సభ్యులకు ఈ ఎన్నికలో ఓటు వేసేందుకు అవకాశం లేదు. వారు అర్హులు కాదు. ఈ విషయాన్ని ఇప్పటికే ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కానీ స్థానిక టీడీపీ నాయకులు మాత్రం తమకు బలం లేకపోయినా గాండ్లపెంట ఎంపీపీ కుర్చీని ఎలాగైనా లాక్కోవాలని కుట్రలు చేస్తున్నారు. ఎన్నికకు హాజరైనట్లు ఎంపీటీసీలందరితో సంతకం చేయించుకున్న వెంటనే ఓటింగ్ జరపకుండానే టీడీపీ అభ్యర్థి ఎంపీపీగా ఎన్నికైనట్లు అధికారిక ప్రకటన విడుదల అవుతుందని ఆ పార్టీ నాయకులే కొందరు బహిరంగంగా ప్రచారం చేస్తున్నారు.

కేసులతో బెదరగొట్టేందుకు కుట్ర

తమ బిడ్డ అనారోగ్యానికి గురైతే వైద్యం చేయించుకోవడానికి ఆసుపత్రికెళ్లామని, అయితే తనతో పాటు తన భర్త గోపాల్‌నాయక్ కిడ్నాప్‌కు గురైనట్లు గాండ్లపెంటలో కేసు నమోదు చేయడమేంటని వైఎస్సార్‌సీపీకి చెందిన సామాలగొంది ఎంపీటీసీ లక్ష్మీదేవి తన భర్తతో కలిసి రెండు రోజుల క్రితం ఒక వీడియో విడుదల చేశారు. ఇది టీడీపీ నాయకులు ఆడుతున్న డ్రామా అని, ఈ కేసుతో వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పరికి షామీర్, పరికి సాదిక్‌లకు ఎలాంటి సంబంధమూ లేదని వారు వెల్లడించారు. అలాగే వైస్ ఎంపీపీ గంగోజమ్మ సైతం కిడ్నాప్ అయ్యారని మరో తప్పుడు కేసు నమోదు చేశారు. ఇలా అక్రమ కేసులు బనాయించి వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు ఎంపీటీసీలను బెదరగొట్టి ఎంపీపీ కుర్చీని దొడ్డి దారిన కైవసం చేసుకోవాలని టీడీపీ నేతలు రోజుకో కుట్ర చేస్తున్నారు. ఈ ఎన్నిక సజావుగా నిర్వహించకపోతే ఇందుకు బాధ్యులైన వారిని కోర్టుకు లాగడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరిస్తున్నారు.

ఎవరి బలం ఎంత?	
మండలం	గాండ్లపెంట
మొత్తం ఎంపీటీసీ స్థానాలు	07
వైఎస్సార్‌సీపీ గెలిచిన స్థానాలు	06
టీడీపీ గెలిచిన స్థానాలు	01

గొడవలు చేస్తే చర్యలు తప్పవు

ఎంపీపీ ఎన్నిక నిష్పక్షపాతంగా జరిగేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు డ్రోన్ కెమెరాల నిఘా కూడా ఉంటుంది. ఎన్నిక జరిగే చోట 30 పోలీస్ యాక్ట్‌తో పాటు 144 సెక్షన్ కూడా అమలులో ఉంటుంది. ఎవరైనా గొడవలకు దిగినా, ఎంపీటీసీలను బెదిరించినా కఠిన చర్యలు తప్పవు.

వి.రత్న, ఎస్పీ

వార్షిక రుణ, జీవనోపాధులపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

బత్తలపల్లి: స్వయం సహాయక సంఘ సభ్యులకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళిక 2025–26 ఆర్థిక సంవత్సరంపై 16 మండలాలకు చెందిన డీఆర్‌డీఏ–వెలుగు ఏపీఎం, సీసీలకు శిక్షణ నిర్వహించారు. బుధవారం బత్తలపల్లిలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో స్వయం సహాయక సంఘ సభ్యుల వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికపై జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఎస్.నరసయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి సంఘం సభ్యురాలి వారీగా 2025–26 సంవత్సరం రుణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. వీఓఏ, సీసీ, ఏపీఎం, ఏసీలు అందరూ వారి స్థాయిలో సరైన కచ్చితమైన సమాచారం వచ్చేలా చూడాలన్నారు. అనంతరం ఐబీ యాంకర్ పర్సన్ ఓబిలేసి, ఏరియా కోర్డినేటర్ డీపీఎం సత్యనారాయణ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో మండల సమాఖ్య కార్యదర్శి కళావతి, కదిరి ఏరియా కోర్డినేటర్ వెంకటనారాయణ, ఓడీ చెరువు ఏసీ రవీంద్ర, బ్యాంకు లింకేజీ యాంకర్ పర్సన్ రాజశేఖర్, ఏపీఎం ఎల్‌హెచ్ రమణప్ప, 16 మండలాలకు చెందిన ఏపీఎంలు, ఎల్‌సీలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

పుట్టపర్తి టౌన్: ప్రజలపై మోపుతున్న విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని ఈ నెల 28న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేశులు పిలుపునిచ్చారు. 'ప్రజలకు విద్యుత్‌షాక్' అనే పేరుతో ముద్రించిన బుక్‌లెట్‌ను బుధవారం సీపీఎం కార్యాలయంలో ఆయన విడుదల చేశారు.

క్లుప్తంగా

ఎంపీపీ ఎన్నిక పత్రాలు పీఓకు అందజేత



ఎన్నికల అధికారికి పత్రాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాండ్లపెంట: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ ఎన్నికకు సంబంధించి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు అందించిన అనెగ్జర్–1, విప్ పత్రాలను ప్రిసైడింగ్ అధికారి (పీఓ) బి.సుదర్శన్‌కు మండల నాయకులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, నాయకులు రామాంజులరెడ్డి, మేకల నరసింహులు, శ్రీరాములు, ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ షాకులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కదిరి టౌన్: సీపీఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన 'విద్యుత్ షాకులు' పుస్తకాన్ని బుధవారం కదిరిలోని ఆ పార్టీ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు మాట్లాడుతూ వినియోగదారులపై ప్రభుత్వం ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయల భారం మోపిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబ్జాన్, ముస్తక్, రామ్మోహన్, రఫీ, సుధాకర్ రెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి సుదర్శన్

గాండ్లపెంట: మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిసైడింగ్ అధికారి బాంబే సుదర్శన్ తెలిపారు. గురువారం ఉదయం పది గంటలకు సమావేశ భవనంలో ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్నిక నిర్వహణపై బుధవారం తహసీల్దార్ బాబూరావు, ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ వలిబాషా, తనకల్లు ఎస్‌ఐ గోపీ తదితరులతో ఆయన సమావేశం నిర్వహించారు.

కార్డెన్ సెర్చ్

కదిరి అర్బన్: మండల పరిధిలోని బాలప్పగారిపల్లి క్వాటర్స్‌లో బుధవారం రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరస్తులు, నాటు సారా కాసేవారు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు.

ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

పుట్టపర్తి టౌన్: గోరంట్లలోని నారాయణ, లయోలా పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం పుట్టపర్తిలోని ప్రగతిశీల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గోరంట్లలో సదరు పాఠశాలలను ఒక వ్యక్తి గుప్పెట్లో పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా తరగతులు, అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు గోపి, అయ్యన్న, నరసింహ పాల్గొన్నారు.

రూ. 6.20 లక్షలు పలికిన వేలం పాట

తలుపుల : వారపు సంత గేటు వసూలు కోసం బుధవారం తలుపుల పంచాయతీ కార్యాలయంలో ఈఓపీఆర్డీ నసీమా, కార్యదర్శి అనీల్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. డీఎల్‌పీఓ అంజినప్ప పర్యవేక్షించారు. మూలపల్లికి చెందిన వి.గంగినాయుడు రూ.6.20 లక్షలకు వేలం పాట దక్కించుకొన్నాడు. పాడుబడిన ఐరన్ వాటర్ ట్యాంకును కె.వెంకటరమణ రూ.50,500కు వేలం పాటలో దక్కించుకున్నారు.

సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

ధర్మవరం: పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు విన్నవించారు. ఈ మేరకు వారు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం, మహాత్మాగాం, దీకాలనీ, రాజశేఖర్‌రెడ్డికాలనీ, కేతిరెడ్డికాలనీ తదితర వార్డుల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. విద్యుత్ సౌకర్యం, రోడ్ల సదుపాయం లేవన్నారు.

సర్కార్ ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో గణేష్ సర్కిల్ సమీపంలోని అబ్దుల్ కలాం షాదీమహల్‌లో బుధవారం ముస్లింలకు ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్, ఉగాది పండుగలు ఒకేసారి వస్తుండంతో హిందూ ముస్లింలు శాంతియుత వాతావరణంలో జరుపుకొందామని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, ఆర్డీఓ సువర్ణ, మైనార్టీ నాయకులు మహమ్మద్‌రఫీ, సయ్యద్, అబ్దుల్ రఫీ, అలా ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కదిరి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, డిపో మేనేజర్ మైనొద్దీన్, ఉద్యోగుల సంఘం తాలూకా యూనిట్ అధ్యక్షులు ఫక్రోద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కదిరి తాలూకా గౌరవాధ్యక్షులు ఆత్మారెడ్డి, కార్యదర్శి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

తలుపుల : ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ రఫినాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

నాటుసారా స్వాధీనం

కదిరి అర్బన్: బాలప్పగారిపల్లి తండాలో బుధవారం కదిరి ఎక్సైజ్ పోలీసులు నాటుసారా స్థావరంపై దాడులు నిర్వహించారు. 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, లక్ష్మీదేవి అనే మహిళను అరెస్ట్ చేశారు. ఆమెను పుట్టపర్తి కోర్టులో హాజరుపరిచారు. అశోక్‌నాయక్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు.


రూ.15 లక్షలు పలికిన కొత్తచెరువు వారపు సంత వేలం

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు వారపు సంతను వేలంలో నల్లమాడ శంకర్ రూ.15,00,500కు దక్కించుకున్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాధ ఆధ్వర్యంలో వారపుసంత, దినసంత, బస్టాండ్ దుకాణాలు, మరుగుదొడ్లకు అధికారులు వేలం నిర్వహించారు. డీఎల్‌పీఓ కేశవరెడ్డి హాజరయ్యారు. వారపు సంతను నల్లమాడ శంకర్ దక్కించుకున్నారు. దిన సంత, బస్టాండ్ మరుగుదొడ్లు కాంప్లెక్స్‌లకు డిపాజిట్లు అధికంగా చెల్లించాల్సి ఉండడంతో వేలంలో ఎవరూ పాల్గొనలేదు. దీంతో ఈ వేలం పాటలు వాయిదా పడ్డాయి. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యుగంధర్, కార్యదర్శి రాంగోపాల్‌రెడ్డితో పాటు పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్విజిలేటర్లపై చర్యలు సరికాదు

పుట్టపర్తి: కదిరిలో బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదని యూటీఎఫ్ జిల్లాఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ ఖండించారు. అసలు సింగిల్ టీచర్లను ఇన్విజిలేషన్ డ్యూటీలకు వేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం కొత్తచెరువులో డీఈఓ కిష్టప్పను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అంజి (50) బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంజి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్యకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

దొరిగిల్లులో షార్ట్‌సర్క్యూట్

ముదిగుబ్బ: దొరిగిల్లులో శివయ్యకు చెందిన ఇంట్లో బుధవారం షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు, సామగ్రి, బియ్యం ప్యాకెట్లు కాలిపోయాయి.